నమస్తే తెలంగాణ
ఖమ్మం
5 | ఖమ్మం, సోమవారం 31 మార్చి 2025 | KHAMMAM

కేసీఆర్ మళ్లీ ముఖ్యమంత్రి కావాలి

- రాష్ట్రంలో ప్రజల బతుకులు మారాలి
- వినాయకపురంలో మోకాళ్ల ప్రదక్షిణ చేసిన బీఆర్ఎస్ నాయకులు

అశ్వారావుపేట రూరల్, మార్చి 30: కేసీఆర్ మళ్లీ ముఖ్యమంత్రి కావాలని, రాష్ట్రంలో ప్రజలు బతుకులు మారాలని భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వారావుపేట మండలంలోని వినాయకపురం గ్రామంలో చిలకలగండి ముత్యాలమ్మ అమ్మవారి ఆలయంలో ఆదివారం బీఆర్ఎస్ నాయకులు మోకాళ్లపై ప్రదక్షిణ చేశారు. భక్తుల కోర్కెలు తీర్చే ఇలవేల్పు, గ్రామదేవతగా పేరుపొందిన ముత్యాలమ్మ తల్లి ఆలయం వద్ద ఉగాది పర్వదినం సందర్భంగా యువజన నేత మోటూరి మోహన్ ఆధ్వర్యంలో బీఆర్ఎస్ నాయకులు ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రాన్ని మళ్లీ కేసీఆర్ పరిపాలించాలని, ఎమ్మెల్యేగా మెచ్చా నాగేశ్వరరావు గెలవాలని, విశ్వావసు నామ సంవత్సరంలో కేసీఆర్ ఆయురారోగ్యాలు, సుఖసంతోషాలతో గడపాలని అమ్మవారిని మొక్కుకున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం మాయ మాటలు చెప్పి ప్రజలను మోసం చేసిందని, ఇప్పుడు ప్రజలు గమనిస్తున్నారని అన్నారు. అవినీతి కాంగ్రెస్ పాలన తమ కొద్దని ప్రజలు ఈసడించుకుంటున్నారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మోటూరి మోహన్‌తోపాటు కునసోతు నవీన్, రాంజీ, రాము పాల్గొన్నారు.

ఆలయం ఎదుట మోకాళ్లపై ప్రదక్షిణ చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

ఎండుతున్న ఏజెన్సీ..!

- నేటికీ 'రోళ్లపాడు'కు చేరని గోదావరి నీరు
- 1975లోనే బేతంపూడి ప్రాజెక్టుగా నిర్మాణం
- 2016లో 'రోళ్లపాడు'కు శంకుస్థాపన
- ఇప్పటివరకు నీళ్లు లేవు.. కాలువలు లేవు..
- రెండో పంటకు నోచుకోని భద్రాద్రి ఏజెన్సీప్రాంత ప్రజలు
- గోదావరి- కృష్ణ అనుసంధానం పేరుతో నీళ్లు మళ్లింపు
- మైదాన ప్రాంతంలో మూడోపంటకు తరలిస్తున్న జిల్లా మంత్రులు
- కాంగ్రెస్ పాలకుల కుట్రపై భగ్గుమంటున్న గిరిజన నాయకులు

భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని రోళ్లపాడు ఆయకట్టు కింద ఉన్న ఏజెన్సీ ప్రాంతంలో పంటలు ఏటా నిలువునా ఎండిపోతున్నాయి. గోదావరి నీటితో తమ ప్రాంతం సస్యశ్యామలమవుతుందన్న ఆ ప్రాంత ప్రజల ఎన్నోయేండ్ల కల.. కలగానే మిగిలిపోతున్నది. రోళ్లపాడు ప్రాజెక్టులోకి దుమ్ముగూడెం నుంచి గోదావరి నీటిని తరలించి అక్కడ నుంచి ఈ ప్రాంతానికి రెండు పంటలకు సాగునీరు అందించాల్సి ఉంది. అయితే నేటి కాంగ్రెస్ పాలకులు కుట్రపన్ని గోదావరి- కృష్ణ జలాల అనుసంధానం పేరుతో గోదావరి నీటిని మళ్లించారు. జూలూరుపాడు నుంచి రోళ్లపాడుకు గోదావరి నీటిని తీసుకురాకుండా ఏన్కూరు వద్ద సాగర్ కాలువలోకి కలిపి మైదాన ప్రాంతంలో మూడోపంటకు నీటిని తరలిస్తున్నారు. ఇక్కడ తమ ఏజెన్సీ ప్రాంత పాలాలను ఎండగొట్టి.. మైదాన ప్రాంతానికి గోదావరి నీటిని తరలిస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వంపై గిరిజన రైతులు భగ్గుమంటున్నారు. -ఇల్లెందు, మార్చి 30

రోళ్లపాడు ప్రాజెక్టు

రోళ్లపాడు చెరువు (ఫైల్)

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా టేకులపల్లి మండలంలో ప్రకృతి సహజంగా చుట్టూ ఏర్పడిన గుట్టల మధ్యలో విశాలమైన ప్రాంతంలో రోళ్లపాడు ప్రాజెక్టు ఉంది. ఉమ్మడి ఆంధ్ర ప్రదేశ్ ప్రభుత్వంలో 1975లో రెండు గుట్టలను కలిపి బేతంపూడి ప్రాజెక్టు నిర్మించారు. దీని ద్వారా 3,500 ఎకరాల ఆయకట్టుకు సాగునీరు అందించడం లక్ష్యం. అయితే అప్పట్లో కాలువలు పూర్తిస్థాయిలో తీయకపోవడంతో 1,500 ఎకరాలకు మాత్రమే సాగునీరు అందింది. తెలంగాణ వచ్చిన తర్వాత ఈ బేతంపూడినే రోళ్లపాడుగా పేరు మార్చి ఇందులో గోదావరి నీటిని నింపడం వల్ల గిరిజన ప్రాంతాలను సస్యశ్యామలం చేసేందుకు 2016లో శంకుస్థాపన చేశారు. రోళ్లపాడు ప్రాజెక్టులో గోదావరి నీటిని నిల్వచేస్తే ఉమ్మడి ఖమ్మం జిల్లాతోపాటు వరంగల్ జిల్లాలో పలు గ్రామాలకు సాగునీరు, తాగునీరు అందనున్నది. దీనిలో భాగంగా దుమ్ముగూడెం వద్ద నున్న గోదావరి నుంచి జూలూరుపాడు వరకు కాలువ కూడా నిర్మించారు. అక్కడి నుంచి రోళ్లపాడుకు కాలువ నిర్మించి నీటిని నింపాలి. కానీ ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని ప్రస్తుత కాంగ్రెస్ పాలకులు కుట్ర పన్ని గోదావరి – కృష్ణ జలాల అనుసంధానం పేరుతో రీ డిజైన్ చేశారు. వారు అనుకున్న విధంగా జూలూరుపాడు నుంచి ఏన్కూరు వరకు చకచకా కాలువ నిర్మించి సాగర్ కాలువలో గోదావరి నీటిని కలిపారు. దీంతో భద్రాద్రి జిల్లాలోని ఇల్లెందు, టేకులపల్లి, గుండాల, ఆళ్లపల్లి, సింగరేణి, కామేపల్లి, మహబూబాబాద్ జిల్లాలో కొన్ని మండలాలకు తీవ్ర అన్యాయం జరిగింది. తమ ప్రాంతానికి అన్యాయం చేస్తున్న కాంగ్రెస్ పాలకులపై గిరిజన రైతులు మండిపడుతున్నారు. రోళ్లపాడు ప్రాజెక్టులోకి గోదావరి నీటిని నింపి ఏజెన్సీ ప్రాంతాన్ని సస్యశ్యామలం చేయాలని డిమాండ్ చేస్తున్నారు.

రోళ్లపాడు ఆయకట్టు కింద నెర్రెలువారిన వరి పాలం

1975లో అప్పటి ప్రభుత్వం రోళ్లపాడు ప్రాంతంలో 3,500 ఎకరాలకు సాగునీరు అందించేందుకు బేతంపూడి ప్రాజెక్టును నిర్మించింది.

మా ప్రాంతానికి సాగునీరు ఇవ్వాలి

కానీ కేవలం 1,500 ఎకరాలకు, అదీ ఒక్క పంటకు మాత్రమే నీరు అందుతున్నది. తెలంగాణ వచ్చాక గోదావరి నీటిని రోళ్లపాడులో నిల్వ చేస్తారని ఆశపడ్డాం. మా పంటలకు నీళ్లొస్తాయని ఎదురుచూస్తున్నాం. కానీ ఇప్పట్లో నీరు వచ్చేలా కనిపించడం లేదు. చాలా బాధగా ఉంది. కాంగ్రెస్ ప్రభుత్వం దృష్టి సారించి మా ప్రాంతానికి సాగునీరు అందించాలి.

– మహ్మద్ అబ్దుల్ ఖయ్యూం, బేతంపూడి గ్రామం, టేకులపల్లి మండలం

ఏజెన్సీకి నీళ్లిచ్చేందుకే 'రోళ్లపాడు'

తెలంగాణ తొలి సీఎం కేసీఆర్ ఏజెన్సీ ప్రాంతాలకు సాగు, తాగునీరు అందించేందుకు ఎంతో కృషిచేశారు. ఇల్లెందు నియోజకవర్గ పరిధిలో సహజ సిద్ధంగా ఉన్న ప్రాంతాన్ని గుర్తించి రోళ్లపాడు ప్రాజెక్టుకు శంకుస్థాపన చేశారు. గోదావరి నీటిని దుమ్ముగూడెం నుంచి తీసుకొచ్చి రోళ్లపాడులో నిల్వ చేసి ఏజెన్సీ ప్రాంతాలను సస్యశ్యామలం చేద్దామని అప్పటి మంత్రి తుమ్మలకు బాధ్యతలు అప్పగించారు. కానీ తుమ్మల రీడిజైన్ పేరుతో నీటిని తరలించడం అన్యాయం. ప్రస్తుతం కూడా మంత్రిగా ఉన్న తుమ్మల ఇప్పటికైనా ఏజెన్సీ ప్రాంతానికి సాగునీరు అందించేందుకు దృష్టి సారించాలి.

– బానోత్ హరిప్రియానాయక్, మాజీ ఎమ్మెల్యే, ఇల్లెందు



మంత్రి తుమ్మల వల్లనే ఏజెన్సీకి అన్యాయం

మంత్రి తుమ్మల నాగేశ్వరరావు వల్లనే ఏజెన్సీ ప్రాంతానికి సాగునీటి విషయంలో తీవ్ర అన్యాయం జరుగుతున్నది. రోళ్లపాడు ప్రాజెక్టుకు దుమ్ముగూడెం నుంచి గోదావరి నీరు రావాలి. కానీ రీడిజైన్ చేయించి గోదావరి నీటిని సాగర్ పారుతున్న మైదాన ప్రాంతానికి తరలిస్తున్నారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఏజెన్సీ ప్రాంతంలో ప్రాజెక్టు కట్టి ఇక్కడ పంటలకు నీరు ఇవ్వకుండా మైదాన ప్రాంతానికి తరలించడం అన్యాయం. ఏజెన్సీ రైతులు సాగునీటి కోసం ఉద్యమం చేపట్టకముందే ముగ్గురు మంత్రులు చొరవ తీసుకోవాలి.

– గుమ్మడి నర్సయ్య, మాజీ ఎమ్మెల్యే, ఇల్లెందు

పంటలు ఎండిపోతున్నాయి..

నాకు రోళ్లపాడు ప్రాజెక్టు కింద మూడు ఎకరాల పొలం ఉంది. ప్రతి ఏడాది యాసంగి వరి సాగు చేస్తున్నాను. ఈ సంవత్సరం పంటకు సాగునీరు అందక ఇబ్బంది పడుతున్నాను. ప్రతి ఏడాది చివరితడి లేక పంట దిగుబడి తగ్గుతున్నది. కొంత పంట ఎండిపోతున్నది. గోదావరి నీళ్లు వస్తాయని ఆశపడ్డాం. కానీ నీరు లేక పంటలు ఎండిపోతున్నాయి.

– సామినేని రవి, టేకులపల్లి

జూలురుపాడు వద్ద ఉన్న సీతారామ కాలువ

రాష్ట్రస్థాయిలో 70వ ర్యాంకు.. మల్టీ జోన్ కేటగిరీలో 5వ ర్యాంకు..

- గ్రూప్-1 జనరల్ ర్యాంకింగ్ లిస్టు విడుదల
- ఇద్దరు ఖమ్మం జిల్లా అభ్యర్థులకు 'మెరిట్'

ఖమ్మం అర్బన్, మార్చి 30: గ్రూప్-1 జనరల్ ర్యాంకింగ్‌ను టీజీపీఎస్సీ ఆదివారం విడుదల చేసింది. ఈ ఫలితాలపై తెలుగు మీడియం అభ్యర్థులకు తక్కువ మార్కులు వచ్చాయని, మూల్యాంకనంలో పక్షపాతం ప్రదర్శించారని రాష్ట్ర స్థాయిలో పలువురు అభ్యర్థులు నిరసనను వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికి దీనిపై ఎలాంటి స్పష్టత ఇవ్వకుండానే ప్రభుత్వం జీఆర్ఎల్‌ని విడుదల చేసింది. రీకౌంటింగ్‌కు సైతం ఖమ్మం జిల్లా నుంచి అధిక సంఖ్యలో అభ్యర్థులు దరఖాస్తు చేసుకున్నారు. అయినా ఎలాంటి మార్పులు లేకుండానే టీజీపీఎస్సీ ఈ మార్కులను వెల్లడించింది. దీనిపై అభ్యర్థులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. కానీ విడుదలైన ఫలితాల్లో జిల్లాకు చెందిన కొందరు అభ్యర్థులు ఉత్తమ మార్కులు సాధించారు.

గ్రూప్-1 సాధన.. నాన్న కల..

ఏఎంవీఐగా నియమితులై రవాణా శాఖ ఖమ్మం కార్యాలయంలో శిక్షణ పొందుతున్న గోపీకృష్ణ గ్రూప్-1లో 493.5 మార్కులతో రాణించాడు. రాష్ట్రస్థాయిలో జీఆర్ఎల్‌లో 70వ ర్యాంకు, మల్టీజోన్-1లో 38వ ర్యాంకు సాధించాడు. ఇతడి స్వస్థలం హనుమకొండ జిల్లా. గ్రూప్-1 అధికారి కావాలనేది తన తండ్రి కల. ఇతడు గతంలో వరుసగా సెంట్రల్ వాటర్ కమిషన్‌లో జూనియర్ ఇంజినీర్, బోర్డర్ రోడ్స్, నేషనల్ ఫెర్టిలైజర్స్ లిమిటెడ్, ఆర్‌సీఎఫ్ఎల్, కొచ్చిన్ షిప్‌యార్డ్, ఐవోసీఎల్, ఇరిగేషన్ శాఖల్లో ఏఈతో ఉద్యోగాలు సాధించాడు.

–గోపీకృష్ణ, జీఆర్ఎల్ 70వ ర్యాంకర్

తండ్రి ప్రోత్సాహంతో..

కుటుంబ సభ్యులతో మైఖేల్

కామేపల్లి మండలం ముచ్చర్లలో స్కూల్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్నాడు దాసరి రవికిరణ్. అతడి కుమారుడు మైఖేల్ ఇమ్మానుయేల్ రాజ్. తండ్రి రవికిరణ్ పోత్సాహంతో గ్రూప్-1కు సిద్ధమయ్యాడు మైఖేల్. ఆదివారం విడుదలైన జీఆర్ఎల్‌లో 429.5 మార్కులతో మల్టీ జోన్ కేటగిరీలో 5వ ర్యాంకు సాధించాడు. మైఖేల్ ప్రస్తుతం డోర్నకల్‌లో తహసీల్దార్ కార్యాలయంలో జూనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్నాడు. కాగా, వీరితోపాటు జిల్లాకు చెందిన మరికొందరు అభ్యర్థులు కూడా జీఆర్ఎల్‌లో ఉత్తమ మార్కులు సాధించారు.

–మైఖేల్, మల్టీ జోన్ కేటగిరీలో 5వ ర్యాంకర్

కొత్త వసంతం 'విశ్వావసు'

- ఉమ్మడి ఖమ్మం జిల్లా వ్యాప్తంగా తెలుగు నూతన సంవత్సరాది వేడుకలు
- ప్రముఖ ఆలయాల్లో ప్రత్యేక పూజలు, పంచాంగ శ్రవణాలు

తెలుగు ప్రజల కొత్త వసంతం 'విశ్వావసు' కాలగమనంలోకి ప్రవేశించింది. చైత్రశుద్ధ పాడ్యమి నూతన సంవత్సరం (ఉగాది) ఆదివారం ప్రారంభం కావడంతో ఉమ్మడి జిల్లా వాసులందరూ తెలుగు ప్రజల నూతన సంవత్సరాదిని ఆనందోత్సాహాల మధ్య జరుపుకున్నారు. సాయంత్రం వేళల్లో అన్ని ప్రముఖ ఆలయాల్లోనూ వేదపండితులు, అర్చకస్వాములు పంచాంగ శ్రవణం చేశారు. విశ్వావసు అనేక సస్యాలతో సువృష్టిని కలిగిస్తుందని, తద్వారా సత్ఫలాలు జరుగుతాయని ఉపదేశించారు. సమస్త మానవాళికి, ప్రకృతికి క్షేమం ప్రాప్తిస్తుందని పేర్కొంటూ అనుగ్రహ భాషణం చేశారు. ఉగాది సందర్భంగా ఉమ్మడి జిల్లాలోని భద్రాచలం శ్రీసీతారామచంద్రస్వామి దేవస్థానంలో, ఎర్రుపాలెం జమలాపురం శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయం, పాల్వంచ పెద్దమ్మతల్లి ఆలయం, కొత్తగూడెం విఘ్నేశ్వరాలయం, కూసుమంచి శివాలయం, ఖమ్మం గుంటుమల్లేశ్వరాలయం, నరసింహస్వామిదేవాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. ఉమ్మడి జిల్లాకు చెందిన ప్రముఖులు, ప్రజాప్రతినిధులు ఆయా ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు.

–నమస్తే తెలంగాణ నెట్‌వర్క్, మార్చి 30

ఖమ్మం భక్తాంజనేయస్వామి ఆలయంలో భక్తుల పూజలు

పాల్వంచ రూరల్: అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు

'పేట'లో 'పానీ' పాట్లు

- గ్రామంలో నిరుపయోగంగా మిషన్ భగీరథ ట్యాంకు
- దాహార్తి తీర్చేందుకు బావి నీరు అందిస్తున్న అధికారులు
- 'భగీరథ' నీరు అందించాలని కోరుతున్న గ్రామస్తులు


అలంకారప్రాయంగా ఉన్న మిషన్ భగీరథ వాటర్ ట్యాంకు

దుమ్ముగూడెం, మార్చి 30: రూ.లక్షల వ్యయంతో నిర్మించిన మిషన్ భగీరథ ట్యాంకు ప్రభుత్వ నిర్లక్ష్యంతో నిరుపయోగంగా మారింది. నిండు వేసవి రాకముందే ఆ గ్రామానికి తాగునీటి కష్టాలను తెచ్చిపెట్టింది. మండలంలోని రామారావుపేటలో గత కేసీఆర్ ప్రభుత్వ పాలనలో మిషన్ భగీరథ వాటర్ ట్యాంకు నిర్మించారు. పైపులైన్లు వేశారు. కానీ ప్రస్తుత ప్రభుత్వం నిర్లక్ష్యం, అధికారుల సమన్వయ లోపం వంటి కారణాలతో మంచినీరు సరఫరా కావడం లేదు. దీంతో గ్రామ శివారులోని ఓ బావి నుంచి ఆర్‌డబ్ల్యూస్ అధికారులు మోటరు అమర్చి గ్రామస్తులకు నీటిని సరఫరా చేస్తున్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో వేసవిలో మంచినీటికి ఎలాంటి ఇబ్బందులు తలెత్తకున్నా.. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో తాగునీటికి అవస్థలు పడుతున్నామని, నీరందించడంలో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని గ్రామస్తులు ఆరోపించారు. సంబంధిత శాఖల అధికారులు పైపులైను ద్వారా నీటిని సరఫరా చేయాల్సి ఉన్నా పట్టించుకోకపోవడంతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అలాగే గ్రామంలోని ఒడ్డుగూంపులో నాలుగు రోజుల క్రితం పైపులైన్లు వేసినప్పటికీ కొన్ని ఇళ్లకు వీటిని బిగించాల్సి ఉంది. 2 హెచ్‌పీ మోటరు ఏర్పాటు చేసి అక్కడి కుటుంబాలకు తాగునీరు అందించేందుకు అధికారులు చర్యలు చేపట్టారు. దీనిపై మిషన్ భగీరథ ఏఈని 'నమస్తే' వివరణ కోరగా.. పైపులైన్లు గతంలో వేశామని, ప్రెజర్ తక్కువగా ఉండడం వల్ల నీరు ట్యాంకులోకి ఎక్కడం లేదని అన్నారు. బూస్టర్ పైపు ద్వారా ట్యాంకులోకి నీటిని ఎక్కించేలా చర్యలు చేపట్టామని, అప్పటివరకు గ్రామ శివారులోని బావి ద్వారా తాగునీటిని సరఫరా చేస్తున్నామని సమాధానమిచ్చారు.

పైపులైన్ ఏర్పాటు కోసం తెచ్చిన పైపులు


నిర్మాణంగా మిగిలిన పైపులైన్ పనులు

'భగీరథ' నీరు అందడంలేదు..

ప్రధాన రహదారికి రెండు కిలోమీటర్ల దూరంలో మా గ్రామం ఉంది. అయినా మిషన్ భగీరథ నీరు పైపులైను ద్వారా అందడం లేదు. గతంలో ట్యాంకు నిర్మించి పైపులైన్లు వేశారు. ఇప్పుడు మాత్రం భగీరథ నీటిని గ్రామానికి అందించడం లేదు. ప్రభుత్వం ఇప్పటికైనా స్వచ్ఛమైన నీటిని సరఫరా చేయాలి. తాగునీటికి ఇబ్బంది లేకుండా చూడాలి.

–కుర్సం పద్మావతి, రామారావుపేట

ఐడీవోసీలో 'యువ వికాసం' హెల్ప్‌డెస్క్

ఏప్రిల్ 5లోగా దరఖాస్తు చేసుకోవాలి: భద్రాద్రి కలెక్టర్

యువవికాసం హెల్ప్‌డెస్క్ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న భద్రాద్రి కలెక్టర్ జితేశ్ వి పాటిల్

కొత్తగూడెం అర్బన్, మార్చి 30:యువతకు స్వయం ఉపాధి అవకాశాలను కల్పించేందుకు, ఆర్థిక సహాయం అందించేందుకు ప్రభుత్వం ప్రవేశపెట్టిన రాజీవ్ యువవికాసం పథకానికి దరఖాస్తులు స్వీకరించడానికి జిల్లా అధికారులు భద్రాద్రి కలెక్టరేట్ (ఐడీవోసీ)లో హెల్ప్‌డెస్క్‌ను ప్రారంభించారు. ఈ మేరకు ఆ పథకానికి సంబంధించిన హెల్ప్‌డెస్క్ పోస్టర్‌ను కలెక్టర్ జితేశ్ వి పాటిల్ ఆదివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. మండల, మున్సిపల్, సేవా కేంద్రాల్లో ఈ హెల్ప్‌డెస్కులను ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. నిరుద్యోగ యువత ఈ పథకానికి దరఖాస్తు చేసుకొని రుణసహాయం పొంది ఆర్థికంగా అభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు. ఏప్రిల్ 5లోపు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

కారేపల్లి లో మంచినీటి కష్టాలు..

కారేపల్లి, మార్చి 30: కారేపల్లి బీసీ కాలనీ ప్రజలు తాగునీటి కోసం అలమటిస్తున్నారు. కుళాయిల ద్వారా నీరు సరఫరా కాకపోవడంతో నానా తంటాలు పడుతున్నారు. పదేండ్ల తర్వాత తమ కాలనీలో మళ్లీ మంచినీటి ఎద్దడి మొదలైందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఒకవైపు కారేపల్లి గ్రామంలో మిషన్ భగీరథ పైపులు పగిలి నీరు వృథాగా పోతుంటే.. తాము మాత్రం నీరు లేక అవస్థలు పడుతున్నామని ఆందోళన చెందుతున్నారు. మూలనపడిన చేతిపంపు నీటిని వాడుతున్నామని, ఆర్‌డబ్ల్యూఎస్, ఇంజినీరింగ్, పీఆర్ అధికారులు కనీసం చర్యలు తీసుకోవడం లేదని స్థానికులు మండిపడుతున్నారు.

వృథాగా పోతున్న మిషన్ భగీరథ నీరు

పదేళ్ల తర్వాత మళ్లీ కష్టాలు

గడిచిన పదేళ్ల కాలంలో తాగునీటి కష్టాలు తెలియదు. అంతకుముందు ఎండాకాలం వచ్చిందంటే చాలు.. మంచినీళ్ల కోసం అల్లాడిపోయేవాళ్లం. ప్రస్తుతం గ్రామ పంచాయతీ కుళాయిల ద్వారా నీళ్ల సక్రమంగా రాక అవస్థలు పడుతున్నాం. బీసీ కాలనీలో మిషన్ భగీరథ పథకం నిర్వహణ అస్తవ్యస్తంగా మారడంతో కాలనీవాసులమంతా తాగునీటికి కటకటలాడుతున్నాం.

–అరుణ, బీసీ కాలనీ, కారేపల్లి, సింగరేణి మండలం

నెత్తిన బిందెలు తప్పవేమో..

మార్చిలోనే ఇలా ఉంటే ఏప్రిల్, మే నెలలను తలచుకుంటే భయమేస్తున్నది. మళ్లీ కిలోమీటర్ల దూరం వెళ్లి మంచినీరు తెచ్చుకునే పరిస్థితి వస్తుందేమో. పంచాయతీ అధికారులు కనీస చర్యలు తీసుకోవడం లేదు. మా కాలనీలో ఉన్న పాత బోరుపంపు కూడా సరిగా పనిచేయడం లేదు. నెత్తిన బిందెలు పెట్టుకొని మహిళలు వ్యవసాయ బావుల వద్దకు నడిచివెళ్లాల్సిన దుస్థితి దాపురించింది.

– రావుల లక్ష్మి, కారేపల్లి, సింగరేణి మండలం